





న్యూ ఇయర్ హుషార్

- 2025కు గ్రాండ్ వెల్‌కం
- వైన్‌షాపులు, బేకరీల వద్ద సందడి
- హోటళ్లకు పెరిగిన ఆర్డర్లు



ములుగులోని కేక్ షాపు ముందు జన సందడి

ములుగు, డిసెంబరు 31 : నూతన ఆంగ్ల సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలుకుతూ జిల్లా ప్రజలు సంబరాలు చేసుకున్నారు. తగ్గేదేలే అన్నట్లు యువత సెలబ్రేట్ చేసుకున్నారు. న్యూఇయర్ వేడుకల్లో కేక్‌లది ప్రత్యేకస్థానం కాగా బేకరీల వద్ద సందడి కనిపించింది. స్పెషల్ ఆఫర్లతో జనాన్ని ఆకర్షించిన బేకరీ యజమానులు జోరుగా కేక్‌లు విక్రయించారు. వాటిని కొనుగోలు చేసేందుకు జనం పెద్దసంఖ్యలో ఎగబడ్డారు. మద్యం, మాంసానికి కూడా అదేస్థాయిలో గిరాకీ జరిగింది. బీరు, లిక్కర్ కొనుగోలుకు మందుబాబులు ఆసక్తి చూపారు. దీంతో వైన్‌షాపులు కిటకిటలాడాయి. రెస్టారెంట్లు, హోటళ్లకు గిరాకీ మస్తుగా జరిగింది. బిర్యానీకి పెద్దఎత్తున ఆర్డర్లు వచ్చాయి. రామప్ప, లక్నవరం, వాజేడు, తాడ్వాయి, మేడారం, ములుగులోని టూరిజం కాటేజీలు, హోటలన్నీ నెలరోజుల ముందే బుక్ అయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన పర్యాటకులు ఇక్కడ న్యూఇయర్ వేడుకలు జరుపుకున్నారు. హోటల్ నిర్వాహకులు కూడా ఆ మేరకు ఏర్పాట్లు చేశాయి. మంగళవారం ఉదయం నుంచే ములుగు వైపుకు వందలాది వాహనాలు బారులుతీరాయి. నలుగురు ఫ్రెండ్స్ కూడి పార్టీకి ప్లాన్ చేసుకున్నారు. అర్ధరాత్రి 12గంటలు కొట్టగానే హ్యాపీ న్యూఇయర్ అంటూ కేరింతలు కొడుతూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొత్త క్యాలెండర్ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ బాణాసంచా కాల్చారు. న్యూఇయర్ వేడుకలపై జిల్లా పోలీసులు దృష్టి పెట్టారు. చట్టవిరుద్ధ కార్యక్రమాలపై కఠిన చర్యలు తప్పవని, మద్యంసేవించి వాహనాలపై రోడ్డెక్కితే కేసులు నమోదు చేస్తామని గట్టిగా హెచ్చరికలు జారీ చేయడంతో రోడ్లపై బైక్ స్టంట్లు తగ్గాయి. విద్యా సంస్థలకు జనవరి 1న ప్రభుత్వం సెలవు ప్రకటించింది.













అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి శిరీష

మాతృత్వం ఓ గొప్ప వరం

సంక్షేమ శాఖ జిల్లా అధికారి శిరీష

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మాతృత్వం గొప్ప వరమని సంక్షేమ శాఖ జిల్లా అధికారి కూచన శిరీష అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలరక్షా భవన్‌లో పిల్లల దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొందరు తల్లిదండ్రులు పోషించలేక పసిపిల్లలను విడిచిపెట్టి వెళ్తుంటారని, అలాంటి చిన్నారులను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ చేరదీస్తాయని తెలిపారు. తల్లి ప్రేమను, తండ్రి ఆప్యాయతలు ఆ పిల్లల హక్కు కాబట్టి ప్రభుత్వం పారదర్శకమైన పద్ధతిలో ఆన్‌లైన్ విధానంతో దత్తత విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రభుత్వం పిల్లలను దత్తత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణాధికారులు ఎస్.హరికృష, పి.కృష్ణవేణి, ఎల్‌సీపీవో డి.సంజీవ, సీహెచ్‌ఎల్ కౌన్సిలర్ ఎం.రజిని, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది స్వప్న, డీసీపీయూ సిబ్బంది సదయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



బీసీలకు అత్యధికశాతం రిజర్వేషన్లు కేటాయించాలి

మెపా జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కులగణన ఆధారంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అత్యధికశాతం రిజర్వేషన్లు కల్పించాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ములుగులోని సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకుముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్, మేనిఫెస్టోలో తెలిపిన ప్రకారం అత్యధికశాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు భూమ నరేష్, మేకల రమేష్, కల్లెబోయిన కిరణ్, కౌశిక్, పండు, రఘు, తదితరులు పాల్గొన్నారు.





నేడు మార్కెట్‌కు సెలవు

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్ గోపాల్‌లోయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వ్యాపారులు, గుమస్తాలు, కూలీలు గమనించాలని, సెలవురోజులో సరుకులు తీసకువచ్చి ఇబ్బందులకు గురికావొద్దని చెప్పారు. గురువారం 2న తిరిగి మార్కెట్ పునఃప్రారంభమవుతుందని చెప్పారు.

గురుకులాల్లో ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

పాలకుర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గూడూరు ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రేణుక తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ.. ఐదో తరగతిలో ప్రవేశానికి, బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైందని అన్నారు. ఐదో తరగతిలో ప్రవేశానికి 2025 ఫిబ్రవరి 23న ప్రవేశానికి పరీక్ష జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 21న ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ ఫిబ్రవరి 1 వరకు కొనసాగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష రుసుం రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డులు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఎం స్వాతి

జనగామ రూరల్, డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): జనగామ ఆర్టీసీ డిపోకు చెందిన ఉద్యోగు లకు మంగళవారం డీ ఎం స్వాతి ప్రగతిచక్ర అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈపీకే సాధించిన ముగ్గురు టీం డ్రైవర్లు, ఏడుగురు కండక్టర్లు, ఇంధనం పొదుపు చేసిన 10 మంది డ్రైవర్లు, ఎయిర్‌బస్ మెయింటెనెన్స్ విభాగా నికి చెందిన ఉద్యోగులను ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆర్టీసీ బస్సులో ప్రతీ ఒక్కరు సురక్షితంగా ప్రయాణం చేసి ఆర్టీసీకి సహకరించాలని కోరారు.

మెరుగైన సేవలను అందిస్తాం



అదనపు ట్రాన్‌ఫార్మర్ వద్ద విద్యుత్ అధికారులు

జనగామ రూరల్, డిసెంబ రు 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందిచడమే తమ లక్ష్యమని విద్యుత్ ఏడీఈ వేణు గోపాల్ అన్నారు. జిల్లా కేంద్రం లోని కురుమవాడ సాయిన గర్‌లో మంగళవారం విద్యుత్ అధికారులు అదనపు ట్రాన్స్‌ఫా ర్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వేసవి ం దృష్ట్యా ఓవర్‌లోడ్ నుంచి ఉపశమనం పొందేందుకు కొత్తగా అదనపు ట్రాన్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కడ ఏర్పడిన అధికారులు, సిబ్బంది వెంటనే స్పదించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జనగామ టౌన్-1 ఏఈ బి. సౌమ్య, సబ్ ఇంజనీర్ మనోహర్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో 104 ఔట్ సోర్సింగ్ సిబ్బంది

- ఆరు నెలలుగా అందని వేతనాలు
- నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

తొర్రూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న 104 సిబ్బందికి 6 నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వీరికి సకాలంలో వేతనాలు అందడం లేదు. దీంతో కుటుంబపోషణ భారమైంది. జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. జీతాల ఫైల్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండటంతో తామేమీ చేయలేమని జిల్లా అధికారులు చెప్పడంతో ప్రభుత్వం కనికరించాలని 104 సిబ్బంది ఎదురు చూస్తున్నారు.

2008లో నియామకం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి 104 వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధికి దూరంగా ఉండి వైద్య సేవలు పొందలేక పోతున్న వారి కోసం గ్రామాల్లో సేవలందించేందుకు 104 వాహనాలు ఏర్పాటు చేశారు. దానిలో ఏఎన్ఎం, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డాటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్‌ను నియమించారు. సిబ్బందిని ప్రభుత్వం డీఎంహెచ్‌వో పరిధిలో ఇతర పనులకు వినియోగిస్తున్నారు.





104 వాహనం, నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఆరు నెలలుగా అందని వేతనాలు

జిల్లా వ్యాప్తంగా 28 మంది ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 104లో పని చేస్తున్నారు. వీరి నిర్వహణ జీతాలు, హెచ్‌ఎంఆర్ఐ సంస్థ వేతనాలు చెల్లించగా కొన్ని రోజుల క్రితం ఆ సంస్థ తప్పుకుంది. దీంతో ప్రభుత్వం ఏజెన్సీకి 104 బాధ్యతలు అప్పగించింది. ఉద్యోగులకు గతంలో లాగా వేతనాలు రావడం లేదు. 104 ఉద్యోగుల్లో ఫార్మాసిస్టుకు రూ.22,700, డ్రైవర్, డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.17,400, ఇతరులకు రూ.12వేల వేతనం అందుతుంది. వేతనాలు చెల్లించాలని 5 రోజులుగా నల్లబ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరవుతున్నారు.

బడ్జెట్ విడుదల కాగానే ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల వినూత్న నిరసన

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సమ్మె బాట పట్టిన సమగ్ర శిక్షా ఉద్యోగులు దశల వారీ ఆందోళనలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సమ్మె శిబిరం వద్ద మంగళవారం వినూత్న నిరసన తెలిపారు. తమను వెట్టిచాకిరీ నుంచి విముక్తి కలిగించాలని మెడకు ఉరి తాడు బిగించుకొని ఆందోళన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సందర్భంగా హామీ ఇస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమగ్రా శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, దానిని ఆయన నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌పాషా, చంద్రకళ, నరేష్, రాజు, తిరుపతి, సుదర్శన్, సతీష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మెడకు ఉరివేసుకుని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

చేనేత, జౌళిశాఖ కమిషనర్‌ను కలిసిన పద్మశాలీ సంఘం



కమిషనర్‌ను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం బాధ్యులు

బచ్చన్నపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజ రామయ్యను మంగళవారం పద్మశాలలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుర్రపు బాల్‌రాజు, మండల ప్రచార కార్యదర్శి మంగళంపల్లి కృష్ణమూర్తిలు హైదరాబాద్ నాంపల్లిలోని తన కార్యాలయంలో కలిశారు. శాలువతో సన్మానిం చారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవచూపాలని కోరారు.

లయన్స్ ఆధ్వర్యంలో ఆల్ఇన్‌వన్‌ల పంపిణీ

కేసముద్రం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజి, ఇంటికన్నె జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం లయన్స్‌క్లబ్ జిల్లా జాయింట్ కోఆర్డినేటర్ పుట్ట హరికిషన్‌రెడ్డి సహకారంతో పదో తరగతి విద్యార్థులకు ఆల్ఇన్‌వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కాలేరు యాదగిరి, హెచ్ఎం వెంకట్రామనర్సయ్య, స్థానిక క్లబ్ పాస్ట్ జడ్‌సీలు చిర్ర యాకాంతంగౌడ్, చందా గోపి, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.చంద్రశేఖర్, బెజ్జం ప్రేమ్‌కుమార్, పరాంకుశం శ్రీహరి, లక్కాకుల సత్యనారాయణ, చింతా కరుణాకర్ పాల్గొన్నారు.

పరీక్షకు హాజరయ్యే ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా సంసిద్ధులను చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్ మండలం అమనగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్సెస్సీ విద్యార్థులకు బీరవెల్లి రవీందర్‌రెడ్డి-అనిత కుటుంబ సభ్యులు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ టెన్త్ వార్షిక పరీక్షలకు 80 రోజుల సమయం మాత్రమే ఉన్నదని, ఈ సమయంలో ప్రతీ రోజు విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. టెస్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి వచ్చే సందేహాలను నివృత్తి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాలకు హాజరుకావాలన్నారు. పరీక్షకు హాజరైన ప్రతీ విద్యార్థి 9.6 జీపీఏ సాధించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏవో మహంకాళి బుచ్చయ్య, హెచ్ఎం కల్లెం వెంకటరెడ్డి, పీఎస్ హెచ్ఎం సత్యశంకర్, ఉపాధ్యాయులు దానయ్య, పహీమ్, శశిధర్, భరత్‌కుమార్, అనిత, కుమార్, రమేష్, నరేష్ పాల్గొన్నారు.



అమనగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

ఉత్తీర్ణత పెంపునకు కృషి చేయాలి

- ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి
- జిల్లాలోని పలు కళాశాలల సందర్శన

జఫర్‌గడ్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : జరగబోయే ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంపునకు అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియట్ విద్య రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ యాదగిరి గౌడ్ సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.జితెందర్‌రెడ్డితో కలిసి ఆయన మంగళవారం జఫర్‌గడ్‌తోపాటు జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా యాదగిరి గౌడ్ అధ్యాపక సిబ్బందితో సమావేశమై ఇంటర్ వార్షిక, ప్రయోగ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. 90 రోజుల ప్రణాళిక అమలు తీరును సమీక్షించారు. కళాశాలలకు రెగ్యులర్‌గా హాజరు కాని విద్యార్థులు, తరగతుల నిర్వహణ వంటి అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఆయా సబ్జెక్టులపై పునశ్చరణ, ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చూడాలన్నారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ చదువు, విద్యాబోధనపై అడిగి తెలుసుకున్నారు. బోధనలను అవగాహన చేసుకుని పరీక్షలకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలన్నారు. చక్కగా చదివి అందరూ ఉత్తీర్ణత సాధించాలని ఉద్బోధించారు. ఈ సమావేశాల్లో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



జఫర్‌గడ్ కళాశాలలో అధ్యాపక సిబ్బందితో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి

ప్రాణాలు తీసిన మైక్రో ఫైనాన్స్ అప్పు!

- ఒకరి తర్వాత ఒకరు దంపతుల ఆత్మహత్య
- పది రోజుల వ్యవధిలోనే ఇద్దరి బలవన్మరణం
- అనాథగా మారిన ఇద్దరు పిల్లలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మైక్రో ఫైనాన్స్‌లో ఆ దంపతులు తీసుకున్న అప్పు వారిద్దరిని బలిగొంది. వేధింపులు తట్టుకోలేక పది రోజుల వ్యవధిలోనే ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. ముందుగా గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే భర్త ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్య మంగళవారం మృతి చెందింది. ఈ వరుస సంఘటనలు భూపాలపల్లి జిల్లాలో చోటుచేసుకున్నాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన బానోత్ దేవందర్ (37), చందన (32) అదే గ్రామంలో కూలినాలి చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం వీరు కుటుంబ అవసర నిమిత్తం మైక్రో ఫైనాన్స్‌లో రూ. 3 లక్షల అప్పు తీసుకున్నారు. ఆ డబ్బులు కిస్తీలు వారం వారం కట్టాల్సి ఉండగా చెల్లించడం వీరికి కష్టతరమైంది. అప్పు ఇచ్చిన మైక్రో ఫైనాన్స్ నుంచి ఒత్తిడి పెరగడంతో ఆ బాధను తట్టుకోలేక చందన డిసెంబరు 6న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. భార్య చందన చికిత్స పొందుతుండగానే భర్త దేవేందర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో డిసెంబరు 20న ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చికిత్స పొందుతున్న చందన మంగళవారం మృతి చెందింది. తన కూతురు ఆర్థిక ఇబ్బందులలో ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. అయితే.. చందన, ఆమె భర్త ఆత్మహత్యకు మైక్రో ఫైనాన్స్ వేధింపులే కారణమని గ్రామస్థులు పలువురు ఆరోపిస్తున్నారు.



అనాథలుగా మారిన పిల్లలు





మృతిచెందిన భార్యభర్తలు బానోత్ దేవేందర్, చందన(ఫైల్)

అనాథగా మారిన ఇద్దరు పిల్లలు

దేవందర్, చందన దంపతులకు ఆరు, తొమ్మిదేళ్ల వయసు ఉన్న ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు ఆత్మహత్య చేసుకోవడంతో ఆ పిల్లలు అనాథలయ్యారు. శిథిలమైన ఇల్లు తప్ప ఈ పిల్లకు ఎలాంటి ఆసరా లేదని, వీరిని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్థులు, బంధువులు కోరుతున్నారు.

ఇద్దరిపై పాక్సో కేసు నమోదు

డోర్నకల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేష్‌నాయక్ మంగళవారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (15) ఒంటరిగా ఇంట్లో ఉండగా, అదే గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తి బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తమ కుటుంబసభ్యులకు తెలపడంతో వారు డయల్ 100కు, చైల్డ్‌లైన్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించినట్లు చెప్పారు. చైల్డ్‌లైన్ సంస్థ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడుపై పోక్సో కేసు చేసినట్లు సీఐ తెలిపారు.

● మండలంలోని ఓ గ్రామపంచాయతీకి చెందిన మైనర్ బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్లు సీఐ రాజేష్‌నాయక్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. బాలిక (14)పై వీరన్న అనే యువకుడు లైంగికదాడికి పాల్పడడంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరన్నపై పోక్సో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఇనుగుర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన వర్లోలు సతీష్ (36) ఈనెల 27న మద్యం సేవించి రోడ్డుపై కళ్లు తిరిగి వెనుకకు పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కేసముద్రం ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. మృతుడి భార్య అనూష నాలుగేళ్ల క్రితం మృతి చెందగా, అప్పటి నుంచి మద్యానికి బానిసైనట్లు వివరించారు. ఈ మేరకు మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మృతుడికి తొమ్మిదేళ్ల కుమార్తె వైష్ణవి ఉండగా, తల్లిలేని ఆ చిన్నారి తన తండ్రికి తలకొరివి పెట్టడం కంటతడి పెట్టించింది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తొర్రూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఫత్తేపురం గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. తొర్రూరు పోలీసుల కథనం ప్రకారం. మాటేడు నుంచి తొర్రూరు వస్తున్న సుమారు 53 సంవత్సరాల వ్యక్తిని భారీ వాహనం ఢీకొట్టినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో వ్యక్తిముఖం ఛిద్రమైంది. మృతుడు సుమారుగా 5ఫీట్ల ఎత్తు, నల్ల బనియన్, గోధుమ కలర్ పాయింట్ ధరించి మెడలో రాగిబొమ్మ ఉన్న నల్లటి దారం ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని తొర్రూరు మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై రాంజీనాయక్ తెలిపారు.

మహిళపై దాడి కేసులో వ్యక్తి ఏడేళ్ల జైలు

కురవి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : వివాహితపై కత్తితో దాడి చేసి, మూడు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటనలో నర్సింహులపేట మండలం పెద్దనాగారం గ్రామశివారు అమీర్‌తండాకు చెందిన బానోత్ సలీంకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానాను విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సి.సురేష్ మంగళవారం తీర్పునిచ్చారు. కోర్టు హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి తెలిపిన సమాచారం ప్రకారం. కురవి మండలం ఎలకచెట్టుతండ శివారు భద్రుతండాకు చెందిన బాదావత్ రమేష్ భార్య చందన 2018 అక్టోబర్ 9న తమ వ్యవసాయ పొలంలో పని చేసుకుంటోంది. ఈ క్రమంలో అదే దారి వెంట ద్విచక్రవాహనంపై వెళ్తున్న బానోత్ సలీం పొలంలో ఉన్న చందనపై కత్తిదాడి చేసి, మెడలో పుస్తెలు, చెవి కమ్మలు (సుమారు 3 తులాల బంగారు ఆభరణాలు) లాక్కొని కత్తితో మెడపై దాడికి పాల్పడినట్లు చెప్పారు. ఈ క్రమంలో చందన కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో సలీం అక్కడ్నుంచి పారిపోయాడు. దీంతో చందన కురవి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకే అప్పటి ఎస్సై నాగభూషణం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి సీఐలు ముత్తిలింగం, వెంకటరత్నం చార్జీషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎస్సై గండ్రాతి సతీష్ సాక్షులను ప్రవేశపెట్టగా నిందితుడు సలీంకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సి.సురేష్ తీర్పు వెల్లడించినట్లు చెప్పారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



లోకేశ్వర్ (ఫైల్)

గూడూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక మానసిక ఒత్తిడికి గురైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు శివారు గడివాడలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. సమ్మెట లోకేశ్వర్ (51)కు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వరి పంటను సాగు చేశాడు. గతంలో తన ఇద్దరు కుమార్తెలు రుషిత, సుచరితల వివాహం కోసం తెచ్చిన సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు పెరిగిపోవడంతో అవి ఎలా తీర్చాలని ప్రతీరోజు మానసికంగా ఇబ్బందులు పడుతుండేవాడని చెప్పారు. గతంలో రెండుసార్లు ఇలా ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు కాపాడి ధైర్యం చెప్పారు. బొంబాయి కుంట సమీపంలో తన పంటక్షేత్రంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై గిరిధర్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా మృతుడు లోకేశ్వర్ మొదటి భార్య నీల గత నాలుగేళ్ల క్రితం పాముకాటుతో మృతి చెందడంతో ఏడాది తర్వాత లోకేశ్వర్ జయలతను రెండో వివాహం చేసుకున్నాడు. జయలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్



మహబూబాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం, మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ప్రజలకు స్థానిక ఎంపీ పోరిక బలరాంనాయక్ మంగళవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025 నూతన సంవత్సరంలో ప్రజలందరికి ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు ప్రసాదించాలని దేవుడిని ప్రార్థించారు. నూతన సంవత్సరమంతా ప్రజలందరికి శుభం జరగాలని, ఉన్నత లక్ష్యాలను చేరుకునే దిశగా నూతన ఉత్సాహంతో అడుగులు వేయాలని ఆకాంక్షించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఘనంగా కొత్త సంవత్సరం వేడుకలు





హనుమకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరానికి ప్రజలు కోటి ఆశలతో స్వాగతం పలికారు. 12గంటలకు పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరాన్ని సాదరంగా ఆహ్వానించారు. కొత్త సంవత్సరంలో అన్ని శుభాలే జరగాలని, అందరూ సంతోషంగా, సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తూ వ్యాట్సాప్ సందేశాలు వెల్లువెత్తాయి. హ్యాపీ న్యూయర్ అంటూ జనం ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. 2025 ప్రవేశానికి శుభసూచనగా పెద్దఎత్తున బాణాసంచాను పేల్చారు. కేకులు కట్ చేశారు. స్వీట్లను పంచుకున్నారు. పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. సంతోషంతో నృత్యాలు చేశారు. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ పాటలు పాడారు. అపార్టుమెంట్ల సెల్లార్లు, ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లు, పేరున్న స్టార్‌హోటళ్లు న్యూ ఇయర్ వేడుకలతో సందరడిని సంతరించుకున్నాయి.

ముస్తాబు

2025కు స్వాగతం పలుకుతూ నగరంలోని వివిధ వ్యాపార సంస్థలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. చర్చీలు, కొన్ని దేవాలయాలను కూడా ముస్తాబు చేశారు. నగరంలోని ప్రధాన కూడళ్లను, కొన్ని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్‌దీపాలతో అలంకరించారు. పలు చోట్ల కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు తమ నేతల ఫోటోలతో 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టారు.

కిటకిటలాడిన మార్కెట్లు

కొత్త సంవత్సరం ప్రవేశం సందర్భంగా కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తెల్లవారుజామునే ఇళ్ల ముందు ముగ్గులు వేయడానికి మహిళలు వివిధ రకాల రంగులను, అలాగే కొత్త సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో పూజలు చేయడానికి ఒక రోజు ముందే ప్రజలు పూలు, ఇతర పూజాద్రవ్యాలను కొనుగోలు చేయడం కనిపించింది. స్నేహితులకు, బంధుమిత్రులకు బహుమతులు ఇవ్వడానికి యువతీ యువకులు రకరకాల గిఫ్టులను కొనుగోలు చేశారు.





మంత్రి సురేఖ శుభాకాంక్షలు

వరంగల్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లక్ష్య సాధనలో ప్రయత్న లోపం లేకుండా కృషి చేస్తూ ఆనందంగా ఉండడమే అర్థవంతమైన జీవితమని పేర్కొన్నారు. యువత లక్ష్యాలను నిర్ధారించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ నూతన సంవ్సతరంలో ప్రతీ ఒక్కరి ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని, అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని మంత్రి ఆకాంక్షించారు.

హనుమకొండ కలెక్టర్..

హనుమకొండ కలెక్టరేట్: జిల్లా ప్రజలకు హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. అన్ని తరగతుల విద్యార్థులు బాగా చదు వుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కొత్త సంవత్సరం 2025లో హనుమకొండ జల్లాను ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అందరి సహ కారంతో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. అభివృద్ధికి జిల్లా ప్రజలందరు సహకరించాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు.



వరంగల్ చౌరస్తాలో రంగులు విక్రయిస్తున్న దృశ్యం



నూతన సంవత్సరం సందర్భంగా భక్తుల కోసం విక్రయానికి లడ్డూలు సిద్ధం



కేక్‌ల అమ్మకాలతో బేకరీల సందడి

కొత్త సంవత్సర వేళ ముస్తాబైన ఆలయాలు

వరంగల్ కల్చరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసేందుకు భారీగా రంగులు కొనుగోలు చేశారు. యువత పెద్ద ఎత్తున కేక్‌లు కొనుగోలు చేస్తారని ముందస్తుగా బేకరీల్లో ప్రత్యేక కేక్‌లు తయారు చేసి అందుబాటులో ఉంచారు. ఇక అర్ధరాత్రి 12 గంటలకు బాణసంచా కాల్చే విషయంలో పోలీసులు ఆంక్షలు విధించడంతో యువత అందుకు దూరంగానే ఉన్నారు.

ఆలయాల ముస్తాబు

ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరంలో దేవాలయాలను ముస్తాబు చేశారు. చారిత్రక భద్రకాళి దేవాలయం అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

వేలాది సంఖ్యలో భక్తులు తరలి వస్తారని ముందస్తుగా ఆలయ అధికా రులు లడ్డూలు తయారు చేసి అందుబాటులో ఉంచారు. ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

వాహనాల తనిఖీలు

ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరంలోని స్టేషన్‌రోడ్డు, చౌరస్తా, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, ఇతర ప్రాంతాల్లో అడుగడుగునా పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మోటారు సైకిళ్లపై స్పీడ్‌గా వెళ్లవద్దని, బహిరంగ ప్రదేశాల్లో డీజేలు, సౌండ్ సిస్టంలను నిషేధించారు. రాత్రి వేళల్లో రోడ్లపై గొడవలు సృష్టించినా, మద్యం సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇంతెజార్‌గంజ్ సీఐ షుకూర్ హెచ్చరించారు.

కోటి ఆశల కొత్త యేడు!

2025లో పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభించేనా?



హనుమకొండ, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు, ప్రజాప్రతి నిధులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు కోటి ఆశలు, కొత్త లక్ష్యాలతో కొత్త సంవత్సరం-2025లోకి అడుగు పెడుతున్నారు. కనీసం 2025 లోనైనా తమ సమస్యలు పరిష్కారం కాగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ కార్డులకు మోక్షం లభించేనా?

సంక్రాంతి తర్వాత రేషన్‌కార్డులు లేనివారందరికీ ఇస్తామని ప్రభుత్వం నమ్మకంగా చెబుతోంది. దీంతో ప్రజలు ఈ కొత్త సంవత్సరంలో తమ రేషన్‌కార్డుల పరేషాన్ తొలగిపోయినట్టేనని భావిస్తు న్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంవత్సరం డిసెంబ ర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలనలో తెల్లరేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 48వేలకుపైగా దరఖాస్తుల చేసుకున్న ట్టు అంచనా. ఉమ్మడి జిల్లాలో 1.80లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఉమ్మడి మొత్తం 8.9 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. అర్హులైన వారు మరో 3 లక్షల మంది వరకు ఉండవచ్చునని అంచనా.



నీడ దొరికేనా?

2025 సంవత్సరంలో కనీసం ఇందిరమ్మ ఇళ్లయినా దక్కాలని గూడులేని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పదేళ్లగా డబుల్ బెడ్‌రూమ్ ఇంటి కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూసి చివరికి నిరాశకు లోనయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ పథకం కింద ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. దరఖాస్తులను స్వీకరించింది. ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపికకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతోంది. సంక్రాంతి తర్వాత ఇళ్ల మంజూరు ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. దీంతో నిలువనీడలేని నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు పెట్టుకున్నారు. ఈ యేడైనా తమకు ఇల్లు ఇస్తుందన్న నమ్మకంతో ఉన్నారు.



నగరంలో అభివృద్ధి పనులు

వరంగల్ అభివృద్ధి దిశగా ఈ ఏడు అడుగులు పడగలవన్న ఆశతో నగర ప్రజలు ఉన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం గత సంవత్సరమే రూ.6,115 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. రింగ్ రోడ్డు, మామునూరు ఎయిర్‌పోర్టుకు భూసేకరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి డీపీఆర్ సిద్ధం చేయడం మొదలైంది. ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న మాస్టర్‌ప్లాన్ ఆమోదం పొందింది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరైంది. మామునూరు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అదనంగా స్థల సేకరణకు జీవో జారీ అయింది. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనితో ఈ ఏడు నగరాభివృద్ధి శరవేగంగా జరుగగలదని, మౌలిక సుదుపాయాలు మరిన్ని అందుబాటులో రాగలవన్న విశ్వాసంతో నగర ప్రజలు ఉన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులకు 2025లో మోక్షం లభించగలదన్న విశ్వాసంతో ప్రజలు ఉన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో చాలావరకు పూర్తికాలేదు. వరంగల్‌లోని పాత సెంట్రల్ జైలు స్థలంలో రూ.1100 కోట్లతో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ భవనం, కాజీపేటలోని ఫాతిమానగర్ బ్రిడ్జి, వరంగల్ నగరం చుట్టూరా చేపట్టిన ఔటర్ రింగ్ రోడ్డు , వరంగల్ బస్టాండ్, స్మార్ట్ రోడ్డు పనులు, గీసుగొండ సమీపంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్క్, సీపీ కార్యాలయం ఆవరణలో కమాండ్ కంట్రోల్ భవనం, వడ్డెపెల్లి బండ్ సుందరీకరణ, వరంగల్‌లో కలెక్టర్ కార్యాలయం భవనం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కొత్త సంవత్సరంలో ఈ పనులకు మోక్షం లభించగలదన్న ఆశతో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులూ ఉన్నారు. జనగామ జిల్లాలో ఎన్నో ఏళ్లగా అపరిష్కృతంగా ఉన్న టెక్స్‌టైల్ పార్క్, అలాగే స్టేషన్‌ఘన్‌పూర్‌లో లెదర్ పార్క్, కొడకండ్లలో టెక్స్‌టైల్ పార్క్‌ల ఏర్పాటుకు 2025లో అయినా మోక్షం కలగాలని ప్రజలు కోరుకుంటున్నారు. నత్తనడకన సాగుతున్న చెన్నూరు రిజర్వాయర్ పనులు కనీసం ఈ ఏడైనా వేగం పుంజుకోవాలని అభిలషిస్తున్నారు.



గ్రీటింగ్ కార్డు యాదిలో..

- ఒకప్పుడు న్యూ ఇయర్ తెలిపే మాధ్యమం
- ఇప్పుడంతా సోషల్ మీడియా ట్రెండే..
- జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్న పాత తరం

హనుమకొండ సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్ వస్తోందనగానే మదిలో తొలుత మెదిలేది అందరికీ గ్రీటింగ్స్ చెప్పాలనే ఆలోచనే. వారం నుంచే ఈ సందడి నెలకొంటుంది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేయడంలో కలిసి ఉన్న బంధాలు మరింత బలపడతాయి. విడిపోయిన బంధాలు మళ్లీ వికసించడానికి దోహదపడతాయి. ఇందుకు గడిచిన కాలంలో అయినా.. ప్రస్తుత తరుణంలో అయినా వారిధిగా నిలిచేది గ్రీటింగ్ కార్డ్. అయితే కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియచేయడంలో ఒకప్పుడు గ్రీటింగ్ కార్డు వేదికగా ఉంటే.. నేటి హైటెక్ యుగంలో సోషల్ మీడియా నిలిచింది. శుభాకాంక్షలు తెలిపే మార్గం మారిన నేపథ్యంలో పాత తరం వారి కాలం నాటి గ్రీటింగ్ కార్డు జ్ఞాపకాలను కొత్త సంవత్సర వేళ నెమరేసుకుంటుండగా.. నేటి యువత సోషల్ మీడియా వేదిక ద్వారా న్యూ ఇయర్ గ్రీటింగ్ తెలిపే ఫీలింగ్స్‌ను ఎంజాయ్ చేస్తున్నారు.

గ్రీటింగ్ కార్డ్ యాదిలో..

2020కి ముందు న్యూ ఇయర్ ట్రెండ్‌ను పాత తరం నెమరేసుకుంటూ నూతన సంవత్సర సెలబ్రేషన్స్‌లో పాల్గొంటోంది. ఎక్కడ నలుగురు ఒక్క చోటకు చేరినా.. ఈ విషయాన్ని చర్చిస్తున్నారు. మన రోజుల్లో ఎలా ఉండేది.. అంటూ సాగే సంభాషణ కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించుకుంటూ ఆ జ్ఞాపకాల లోతుల్లోకి వెళుతున్నారు. గ్రీటింగ్ కార్డు అందుబాటులో లేకుంటే పోస్టు కార్డు.. లేదా ఇన్ లాండ్ లేటర్ ద్వారా కూడా పెద్ద పెద్ద అక్షరాలతో హ్యాపీ న్యూ ఇయన్ అని మాత్రమే రాసి తెలిపే వాళ్లం.. అంటూ పెద్దలు జ్ఞాపకం చేసుకుంటున్నారు. గ్రీటింగ్‌కార్డు కొనాలంటే డిసెంబరు 15వ తేదీ నుంచే సిద్ధపడే వాళ్లమంటున్నారు. ఎందుకంటే దూర ప్రాంతాలకు పోస్టు చేయడానికి ముందే తీసేసుకునే వాళ్లమంటున్నారు. కార్డు సెలక్షన్ కోసం బుక్ స్టాల్స్ గ్రీటింగ్ కార్డు విక్రయించే గిఫ్ట్ సెంటర్లకు వెళ్లి అరగంటకు పైగా సమయం తీసుకొని సెలక్షన్ చేసుకునే వాళ్లమంటున్నారు. ఇక ప్రేమికులకు అయితే గ్రీటింగ్ కార్డు వెరీ వెరీ స్పెషల్ అంటున్నారు. గ్రీటింగ్ కార్డు ఇవ్వడం ప్రేమను వ్యక్తం చేయడానికి ఒక మార్గంగా ఉండేదంటున్నారు. అప్పటికే ప్రేమికులు అయితే.. కార్డు స్పెషల్‌గా ఉండే సెలక్షన్స్‌లో పోటీ పడే వాళ్లమంటూ ఓల్డ్ జనరేషన్ గుర్తు చేస్తూ.. నూతన సంవత్సర వేళ గ్రీటింగ్ కార్డు జ్ఞాపకాలను వ్యక్తం చేస్తూ కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్నారు. మారిన ట్రెండ్‌ను ఫాలో అవుతూ ఇక మేము కూడా సోషల్ మీడియాను ఫాలో కావాల్సిందే కదా.. అంటూ న్యూ ఇయర్‌కు వెల్‌కం చెబుతున్నారు.





సోషల్ మీడియా వేదికగా నేటి తరం

ఇప్పుడంతా సోషల్ మీడియా ప్రపంచం. కొత్త సంవత్సర వేళ వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఇతరత్రా సోషల్ మీడియా ద్వారా న్యూ ఇయర్ గ్రీటింగ్స్ తెలియచేస్తున్నారు. ఇంట్లో పెద్దలు ఉంటే వారి జ్ఞాపకాలను వింటూ.. ఇప్పుడంతా సోషల్‌మీడియా ట్రెండ్.. అంటూ ఆ మార్గంలో గ్రీటింగ్స్ చెబుతున్నారు. పాత, నేటి తరం గ్రీటింగ్స్ జ్ఞాపకాలు, అనుభవాలతో కొత్త సంవత్సరంలోకి సందడిగా ప్రవేశిస్తున్నారు.

ఎస్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శిగా సన్నగుండ్ల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ములుగులో జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య నియామకపత్రాలు అందజేశారు. జిల్లా సంయుక్త కార్యదర్శిగా దేవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, వెంకటాపూర్ మండల అధ్యక్షుడిగా ఎనబోతుల రాజు, ప్రధాన కార్యదర్శిగా వెలిశోజు లతాసాగర్, గోవిందరావుపేట మండల అధ్యక్షుడిగా వంగరి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా యలగందుల వెంకటేశ్వర్‌రావు, ములుగు మండల ఉపాధ్యక్షుడిగా బుద్దె మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా కోడిపాక మహేందర్, ప్రచార కార్యదర్శిగా మర్రికుక్కల రాజు, పట్టణ కార్యదర్శిగా ఎస్కే.ఉమర్‌షేక్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు గోగులమూడి హరికృష్ణ, రాష్ట్ర సోషల్ మీడియా కోకన్వీనర్ కోడిపాక రవి, ములుగు మండల అధ్యక్షుడు వీరమల్ల రాము, నాయకులు కె.శ్యామ్, ఉప్పుల కోమల, కొడారి గణేష్, కొండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు పాఠశాలలో బాలల గ్రామసభ

వాజేడు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతూరు పాఠశాలలో మంగళవారం బాలల గ్రామసభ నిర్వహించారు. జీపీ కార్యదర్శి చిచ్చడి ఆశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలల హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సంబరాలు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని ఇస్రో సాంకేతికత రాకెట్ సంస్థ స్పెండెక్స్ మిషన్ ఇన్ స్పేస్ డాకింగ్ రాకెట్లను ప్రయోగించి ప్రపంచ దేశాలకు సవాల్ విసరడాన్ని పురస్కరించుకుని ములుగులో భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. ములుగులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బాణాసంచా కాల్చి కేక్ కట్ చేశారు. అనంతరం భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి కన్వీనర్ జన్ను రవి మాట్లాడుతూ దేశంలోని యువత శాస్త్రీయ విధానం వైపు ఆలోచించాలని అన్నారు. ఈకార్యక్రమంలో కోకన్వీనర్లు నద్దునూరి రమేష్, నెమలి నర్సయ్య, నాయకులు పాషా, ఓరుగంటి అనిల్, మాదారపు రాజు, అలువాల రాజ్‌కుమార్, నరేష్, సమ్మయ్య, ఎమ్డీ.మౌలానా, రత్నం ప్రవీణ్, కలువల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

గోవిందరావుపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీహెచ్‌ఎస్‌లు, ఎంపీపీఎస్ పాఠశాలల్లో నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ఎస్ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని, పీఆర్సీ రిపోర్టును తెప్పించి వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఈక లక్ష్మీనారాయణ, ఎంఈవో గొంది దివాకర్, ఉపాధ్యాయులు కె.రఘురాం, బానోత్ రాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుష్పమాస వేడుకలు

ఏటూరునాగారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పుష్పమాస వేడుకలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రం క్రాస్ రోడ్డులోని శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో అర్చకుడు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆంజనేయ స్వామి వారిని తమలపాకులతో సుందరంగా అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమంలో సీఐ అనుముల శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థిని ప్రతిభ



వెంకటాపూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ మైనారిటీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఎస్కే.రేష్మా రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అథ్లెటిక్స్ క్రీడల్లో తృతీయస్థానం సాధించింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వందన మంగళవారం తెలిపారు. ఇటీవల హనుమకొండలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అండర్-19 బాలికల విభాగంలో రేష్మా 100 మీటర్ల పరుగుపందెం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందని అన్నారు. మంగళ వారం హైదరాబాద్‌లో జరిగిన అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెంలో రేష్మ తృతీయస్థానం కైవసం చేసుకుందని తెలిపారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ నవ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

గొత్తికోయలకు దుస్తులు, పాదరక్షలు పంపిణీ

ఏటూరునాగారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలోని ఆదివాసీ బిడ్డల జీవితాల్లో సంతోషాన్ని నింపడమే పోలీసుల లక్ష్యమని ఏటూరునాగారం ఎస్సై తాజుద్దీన్ అన్నారు. మండలంలోని కొమరంభీమ్ నగర్ గొత్తికోయగూడాన్ని ఆయన తన సిబ్బందితో కలిసి మంగళవారం సందర్శించారు. ఆదివాసీలకు నూతన వస్త్రాలు, పాదరక్షలు పంపిణీ చేశారు. నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంలో ఆదివాసీ బిడ్డల జీవితాల్లో సంతోషాన్ని నింపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆయన తెలిపారు.



గొత్తికోయలకు దుస్తులు పంపిణీ చేస్తున్న పోలీసులు

నేరాలు స్వల్పంగా పెరిగినై..



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

- మహిళలపై దాడుల పెరుగుదల
- మేడారం జాతర, పార్లమెంటు ఎన్నికలు విజయవంతం
- సైబర్ క్రైమ్స్, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్నాం
- నేరాల కట్టడికి సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నాం
- ములుగు ఎస్పీ శబరీశ్

ములుగు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గడిచిన సంవత్సరం (2024)లో ములుగు జిల్లాలో క్రైమ్ రేట్ స్వల్పంగా పెరిగిందని ఎస్పీ శబరీశ్ తెలిపారు. సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని వెల్లడించారు. 337సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసినట్లు తెలిపారు. దీంతో నేరాలను అదుపు చేయడంతోపాటు దర్యాప్తు సులభతరమైందని తెలిపారు. మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర, పార్లమెంటు ఎన్నికలను విజయవంతంగా జరిపించామన్నారు. మంగళ వారం పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఏడాది కాలంలో నమోదైన నేరాలు, నియంత్రణ వివరాలను వెల్లడించారు.

ఏడాదిలో 2148 కేసులు నమోదు

ఏడాది కాలంలో 2148కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. గతేడాది 1548కేసులు నమోదుకాగా 551కేసులు పెరిగాయన్నారు. ప్రధానంగా ఒక డెకాయిట్, రెండు రాబరీ, 46దొంగతనం, 13హత్య, 102సాధారణ దొంగతనాలు, 33కిడ్నాప్, 79ఛీటింగ్, 11హత్యాయత్నం, 194రోడ్డు ప్రమాదాలు, 96మిస్సింగ్ కేసులు నమోదైనట్లు చెప్పారు. మహిళలపై అఘాయిత్యాలు గతేడాదితో పోల్చుకుంటే స్వల్పంగా పెరిగాయని వెల్లడించారు. కిడ్నాప్, హత్యాయత్నం కేసుల్లో కూడా స్వల్ప పెరుగుదల ఉందన్నారు. గతేడాది 121కేసులు నమోదకాగా ఈసారి 47పెరిగి 168కి చేరాయన్నారు. 32మైనర్లు, ఓ మహిళ కిడ్నాప్‌కు గురికాగా అందరినీ కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. గతేడాది 54దొంగతనాలు జరిగితే ఈసారి 97పెరిగి 151చోటుచేసుకున్నాయన్నారు. రూ.1,63,48,076 విలువైన నగదు, వస్తువులు చోరీకి గురికాగా రూ.28,05,100సొత్తును రికవరీ చేశావని చెప్పారు. గతేడాది 113రోడ్డు ప్రమాదాల జరిగితే ఈసారి 48పెరిగి 161జరిగాయన్నారు. 13బ్లాక్ స్పాట్లను గుర్తించి సైన్‌బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నామని, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మాదక ద్రవ్యాల నివారణలో భాగంగా జరిపిన దాడుల్లో 14కేసులను నమోదుచేసి 59.463కిలోల గంజాయిని సీజ్‌చేశామని ఎస్పీ తెలిపారు.

పెరిగిన సైబర్ నేరాలు

సైబర్, గేమింగ్ యాప్స్, గంజాయి, అక్రమ ఇసుక రవాణా కేసుల్లో పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. 32సైబర్ నేరాలు నమోదు కాగా రూ.18,20,997ను తిరిగి బాధితులకు ఇప్పించినట్లు ఎస్పీ శబరీశ్ తెలిపారు. ఈతరహా నేరాల కట్టడికోసం గ్రామాలు, విద్యాసంస్థలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గేమింగ్ యాప్‌లో భాగంగా 55కేసులు నమోదు చేసి 6,94,467సొత్తును సీజ్‌చేశామని తెలిపారు. 4కేసులలో 77.9 క్వింటాల పీడీఎస్ బియ్యం పట్టుకున్నామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న 123వాహనాలపై కేసులు నమోదు చేశామని తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ప్రజలు పోగొట్టుకున్న 645 ఫోన్లలో 400ఫోన్లను తిరిగి ఇప్పించామని చెప్పారు. లోక్ అదాలత్‌ల ద్వారా 3407కేసులలో కక్షిదారులు రాజీపడేలా ప్రోత్సహించామన్నారు.

నక్సలిజం కట్టడి

నక్సలిజాన్ని కట్టడి చేసినట్లు ఎస్పీ తెలిపారు. రెండు ఎదురుకాల్పుల ఘటనలు చోటుచేసుకోగా 8మంది మావోయిస్టులు మరణించారన్నారు. 20మంది అజ్ఞాత నక్సల్స్‌ను అరెస్టు చేశామని, ఆరుగురు లొంగిపోయారని తెలిపారు. 18ఐఈడీలను నిర్వీర్యం చేశామని, పెద్దఎత్తున మారణాయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీన పర్చుకున్నామని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ములుగు అదనపు ఎస్పీ సదానందం, డీసీఆర్‌బీ డీఎస్పీ కిశోర్‌కుమార్, ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అజయ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సీఐ శ్రీనివాస్, రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కృషి

భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

వెంకటాపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. వెంకటాపురం, వాజేడు మండలాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని, ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేయిస్తానని అన్నారు. కాంగ్రెస్ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి పాటుపడాలన్నారు. కొత్తగా పార్టీలో చేరినవారు మండలపార్టీ నాయకులతో కలిసి పనిచేయాలని, సొంత నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన సూచించారు. ఇటీవల పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న నలుగురు వ్యక్తులను సస్పెండ్ చేసిన మాట వాస్తవమేనని, వారిపై ఉన్న సస్పెండ్‌ను ఎవరూ ఎత్తివేయలేదని అన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెం సాంబశివరావు, నాయకులు మన్నెం సునీల్, సాధనపల్లి శ్రీను, కొండపర్తి సీతాదేవి, చిట్టెం సాయి, పిల్లారిశెట్టి మురళి, గార్లపాటి రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కేశ్వరంలో పౌరహక్కుల దినోత్సవం

డుమ్మాకొట్టిన ప్రధాన శాఖల అధికారులు



ఎల్కేశ్వరంలో పౌరహక్కుల దినోత్సవంలో అధికారులు

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 31 : మండలంలోని ఎల్కేశ్వరం గ్రామంలో పౌరహక్కులపై మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామంలో అంటరానితనం, అస్పృశ్యత, వివక్షతల నిర్మూలనకు చట్టపరమైన చర్యల గురించి వివరించారు. పౌరహక్కుల వినియోగంపై గ్రామస్థులకు సూచనలు చేశారు. గ్రామంలో సర్వే నంబరు 167 సంబంధించి ఉన్న భూసమస్యపై గ్రామస్థులు ప్రశ్నలు లేవనెత్తగా అటవి, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించి త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అయితే.. గ్రామీణ స్థాయిలో నెలకు ఒకసారి నిర్వహించే ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ అధికారులతో పాటు విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ, విద్యాశాఖల నుంచి ఏఒక్క అధికారి కూడా పాల్గొనలేదు. ప్రతి నెలా ఈ శాఖల నుంచిఅధికారులు గైర్హాజరవుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గత నెలలో జిల్లాలో పర్యటించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు సైతం పౌరహక్కుల దినోత్సవంలో అన్ని శాఖల నుంచి అధికారుల పాల్గొనాలని సూచించినప్పటికీ వారి మాటలను పెడచెవిన పెడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై తహసీల్దారును వివరణ కోరగా అన్ని శాఖల అధికారులతో పాటు గ్రామస్థులకు మూడురోజుల ముందుగానే సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే నెలలో నిర్వహించే పౌరహక్కుల దినోత్సవానికి ప్రతి శాఖకు తమ శాఖ నుండి ప్రత్యేక నోట్ పంపిస్తామని చెప్పారు. ఇదే అంశంపై అంబేద్కర్ సంఘం నాయకులు ప్రశ్నించినట్లు తెలిపారు. కాగా పౌరహక్కుల దినోత్సవం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఆయా శాఖల అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు ఉదయం 9గంటల నుంచి కార్యక మం నిర్వహించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ కార్యక మంలో రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దార్ ప్రహ్లాద్, డిప్యూటీ తహ సీల్దార్ కృష్ణ, ఆర్ఐ జగన్‌మోహన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రఘు, పంచాయతీరాజ్ శాఖ నుంచి ఎంపీవో ప్రసాద్, అటవీశాఖబీట్ అధికారి, కార్యదర్శి గాయత్రి, అంబేద్కర్ సంఘం నాయకులు మేరుగు లక్ష్మణ్, లింగాల రామయ్య పాల్గొన్నారు.

బొకేలు వద్దు.. బుక్కులు కానుకలుగా ఇవ్వండి : కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు కలెక్టర్ రాహుల్‌శర్మ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025 సంవత్సరం అందరికీ శాంతి, సంతోషం, ఆరోగ్యం, అభివృద్ధి చేకూరాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాలు ఆనందమయం కావాలని కోరుకున్నారు. తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు అధికారులు, ఇతరు బొకేలు, పుష్పగుచ్ఛాలతో కాకుండా పుస్తకాలు, పెన్నులు, పెన్సిన్లు తీసుకురావాలని కోరారు. అవి పేద విద్యార్థులకు ఇచ్చేందుకు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు.

వాజేడు తహసీల్దార్‌గా శ్రీనివాస్

వాజేడు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వాజేడు తహసీల్దార్‌గా గతంలో ఇక్కడ పని చేసిన ఎస్.శ్రీనివాస్‌ను మళ్లీ నియమించారు. ప్రస్తుతం వాజేడు తహసీల్దార్‌గా ఉన్న వీరభద్రప్రసాద్ పదవీ కాలం మంగళవారం ముగిసింది. దీంతో తహసీల్దార్ పోస్టు ఖాళీ కావడంతో గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శ్రీనివాస్‌ను నియమించారు. ఆయన జనవరి 2న బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. రిటైర్ అయిన తహసీల్దార్ వీరభద్రప్రసాద్‌కు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

ఇందిరమ్మ కమిటీని రద్దు చేయాలి

కన్నాయిగూడెం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షెడ్యూల్డ్ తెగ ఐలాపూర్ గ్రామంలో పెసా చట్టానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీని రద్దు చేయాలని మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య, కొమురంభీం యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆలం నాగేష్ డిమాండు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ కుట్రతో కాంగ్రెస్ నాయకులు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ గ్రామంలో ఎలాంటి గ్రామ సభలు ఏర్పాటు చేయకుండా గ్రామస్థుల ప్రమేయం లేకుండా దొడ్డి దారిన ఇందిరమ్మ కమిటీలు వేశారని విమర్శించారు.

మార్కెట్లో న్యూ ఇయర్ సందడి



రంగులు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

కాటారం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకల కొనుగోళ్ల సందడి నెలకొంది. స్థానిక అంబేద్కర్ కూడలిలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన షాపుల్లో మహిళలు నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలకడానికి వివిధ రకాల రంగులను కొనుగోలు చేశారు. ఇళ్ల ముందు వాకిళ్లలో, ఫ్లోరింగ్ పైన రంగురంగుల రంగవల్లులు వేయడానికి పలువురు మహిళలు వివిధ రకాల రంగులను కొనుగోలు చేయడం కనిపించింది. మార్కెట్లో అమ్మకానికి వచ్చిన పూలను, దండ లను కొన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు బేకరీల్లో కేక్‌లను ఆర్డర్ చేయడం, కొనుగోలు చేయడం జరిగింది. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక యువకులు విందు, వినోదాల కోసం వైన్ షాపుల్లో మద్యం కొనుగోలు చేస్తూ కనిపించడం కొసమెరుపు.

విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

కాటారం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసులు మంగళవారం రాత్రి విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో సీఐ నాగార్జునరావు నేతృత్వంలో ఎస్సై మ్యాక అభినవ్ వాహనదారులకు టెస్టులు చేపట్టారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపి ఇబ్బందుల పాలు కావద్దనే డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య



మనీషా(ఫైల్)

ఏటూరునాగారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రాలోని యాదవనగర్‌కు చెందిన బట్ట మనీషా (24) హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో హెడ్ నర్సుగా పనిచేస్తోంది. పది రోజుల క్రితం హనుమకొండ నుంచి ఏటూరునాగారంలోని తమ ఇంటికి వచ్చిన ఆమె ముభావంగా ఉంటోంది. తల్లిదండ్రులు సమ్మక్క, బాబు, తమ్ముడు మనోత్‌తో సరిగా మాట్లాడటం లేదు. ఈ క్రమంలో గత రెండు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగిన సొమ్మసిల్లిపోయింది. దీంతో ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించ డంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందుతున్న క్రమంలోనే మనీషా మంగళవారం సాయంత్రం మృతి చెందింది. అయితే.. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తాజుద్దీన్ తెలిపారు.


చికిత్స పొందుతూ యువతి మృతి



పౌర్ణమి (ఫైల్)

మేడారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహ త్యాయత్నం చేసిన యువతి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన తాడ్వాయి మండలం నార్లాపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాత మలయ్య, సునీత దంపతుల కూతురు పౌర్ణమి(18) అదే గ్రామానికి చెందిన కొడిశాల నవీన్‌తో 10నెలల క్రితం ప్రేమ వివాహం జరిగింది. కొన్ని రోజులకే వీరిద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన పౌర్ణమి డిసెం బరు 16న పురుగుల మందు తాగింది. దీంతో ఆమెను వరంగల్ ఎంజీఎ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో ఆమె మంగళవారం మృతి చెందింది. మృతురాలి తల్లి సునీత ఫిర్యాదు మేరకు భర్త, అత్తామా మలు, ఆడబిడ్డపై కేసు నమెదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అత్తపై కోడలు గడ్డపారతో దాడి



గాయపడిన జయమ్మను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

మొగుళ్లపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అత్తపై కోడలు దాడి చేసింది. కంట్లోకారం చల్లి గొంతులో గడ్డపారతో పొడిచింది. ఈ సంఘటన మండలంలోని వేములపల్లి గ్రామంలో మంగళ వారం రాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని గుత్తికొండ జయమ్మ(45) భర్త జంపయ్య ఏడాది క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆమె రోజు వారీగా వ్యవసాయ కూలి పనిచేసుకుంటూ జీవిస్తోంది. ఆమె పెద్ద కుమారుడు అరవింద్, కోడలు మౌనిక హైదరాబాద్‌లో ఉంటున్నారు. నెలరోజుల క్రితం వారు వేములపల్లికి రాగా కొద్దిరోజుల నుంచి అత్త జయమ్మతో మౌనిక చిన్నచిన్నగా గొడవ పడుతోంది. మంగళవారం జయమ్మ కూలిపనికి పోయి ఇంటికి రాగా ఆమెతో గొడవపడింది. ఈ క్రమంలో కంట్లో కారంపొడి చల్లి పక్కనే ఉన్న గడ్డపారతో గొంతులో పొడి చింది. దీంతో జయమ్మ కిందపడి స్పృహ కోల్పోగా తీవ్ర రక్తస్రావం జరిగింది. చుట్టుపక్కల వారు జయమ్మను చికిత్స నిమి త్తం వరంగల్‌కు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

మాంజా మెడకు బిగిసి యువకుడికి గాయాలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మెడకు గాలిపటం మాంజా చుట్టుకొని యువకుడు గాయపడివన సంఘటన భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీలో మంగళవారం జరిగింది. అదే కాలనీకి చెందిన సుముద్రాల అజయ్ జయశంకర్ కూడలి నుంచి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో కూరగాయల మార్కెట్ సమీపంలో గాలిపటం మాంజా అజయ్ మెడకు చుట్టుకుంది. దీంతో అతడు వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. మెడకు స్వల్పంగా కోసుకోవడంతో రక్తస్రావమైంది.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా

చిట్యాల, డిసెంబరు 31 (ఆధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం నగర కార్యదర్శి బుర్ర అభిజ్ఞ మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు తమ సమస్యలు పరిష్కరించాలని 22 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న సమయంలో విద్యార్థులకు పాఠాలు బోధించేవారు లేకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోందని తెలిపారు. ఈకార్యక్రమంలో అవినాష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలించిన అధికారులు

మల్హర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగులమ్మ వద్ద నుంచి తాడిచర్ల వరకు రోడ్డును మంగళవారం ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించారు. రోడ్డు స్థితిగతులను పరిశీలించారు. ఇప్పటికే రూ. 33 కోట్లతో రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైతే పనులు ప్రారంభకానున్నట్లు వారు తెలిపారు. దబ్బగట్టు నుంచి నాగులమ్మ వరకు రోడ్డు అక్కడక్కడ పూర్తిగ దెబ్బతినడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

డబ్బులిస్తేనే ఇందిరమ్మ ఇళ్ల సర్వే!



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

మహాముత్తారం, డిసెంబరు31: ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు నిలువ నీడ కోసం ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి సర్వేను నిర్వహిస్తోంది. అయితే... కొంత మంది సర్వే చేసే అధికారులు దరఖాస్తుదారుల వద్ద నుంచి డబ్బులు తీసుకొంటూ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మహాము త్తారం మండలం మహాముత్తారం గ్రామపంచాయతీ పరిధిలోని దౌతుపల్లి ఆదివాసీ గ్రామంలో సర్వే నిర్వహించడానికి వచ్చిన ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్ సోమవారం 10 మంది మహిళల నుంచి రూ: 500 చొప్పున డిమాండ్ చేసి తీసుకొన్నట్లు వారు తెలిపారు. డబ్బులు ఇవ్వకపోతే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావని డబ్బులు ఇచ్చిన వారికే ఇళ్లు మంజూరు చేయిస్తానని తెలిపినట్లు పొడెం రాజక్క అనే మహిళ తెలిపింది. ఆ అధికారి ఆలం సమ్మక్క, తడండ్ల రజిత, పెరం సునీత, పొడెం రాజక్క, తడండ్ల లక్ష్మి, కొప్పుల రామక్క, రజిత, తడండ్ల మల్లయ్య, మల్లక్క, పోశయ్యల వద్ద డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మంగళ వారం 10 మంది మహిళలు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావుకు వారు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీడీ వోను వివరణ కోరగా సర్వే చేసే అధికారి తమ వద్ద డబ్బులు తీసుకున్నట్లు 10 మంది మహిళలు ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. విచారణ జరిపి చర్యల కోసం ఉన్నతాధికారులను నివేదిస్తామని తెలిపారు.

జమిలీ ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం

టీ.మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్

కాటారం, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి):బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న జమిలీ ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని ఉత్తర తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పీక కిరణ్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల తో మాట్లాడారు. బీజేపీ మనువాద హిందుత్వ సూత్రాలకు అనుగుణంగా పనిచేసి నిమ్న వర్గాల ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేయడానికి చూస్తున్నదని దుయ్యబట్టారు. నల్ల చట్టాలు అమలుచేస్తూ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నదని మండిపడ్డారు. కుల, మతాల పేరిట వైరుధ్యాలు సృష్టిస్తున్న బీజేపిని తీరును ఎండగట్టాలన్నారు.

మేడారంలో డీపీవో పర్యటన

మేడారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వా యి మండలం మేడారంలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ మంగళవారం పర్యటించారు. మినీ జాతరకు సమయం దగ్గర పడుతున్న క్రమంలో భక్తుల తాకిడి పెరిగింది. భక్తులు పరిసరాల్లో వదిలిన వ్యర్థాలను తొలగించడం, మరుగుదొడ్ల సౌకర్యాలు, వసతి గృహాల ఏర్పాటును ఆయన పరిశీలించారు. దేవాలయం పరిసరాల్లో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌ల వద్ద సిబ్బంది వెంటనే నియమించాలని కార్యదర్శి సతీష్‌ను ఆదేశించారు. ప్రస్తుతం మేడారంలో పారిశుధ్యమ పనులు చేపడుతున్న కార్మికుల్లో కొంత మందిని మూడు సులభ్ కార్మికులుగా నియమించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా, దుర్వాసన రాకుండా మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ 5 భూపాలపల్లి
బుధవారం 1 జనవరి 2025



మెడకు ఉరితాడు బిగించుకొని..

సమగ్ర శిక్షా ఉద్యోగుల వినూత్న నిరసన

6లో

ప్రాణాలు తీసిన మైక్రో ఫైనాన్స్ అప్పు!

పది రోజుల వ్యవధిలోనే దంపతుల ఇద్దరి ఆత్మహత్య

బొకేలు వద్దు.. బుక్కులు కానుకలుగా ఇవ్వండి : కలెక్టర్- 8లో



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు, బేకరీలో విక్రయానికి సిద్ధంగా ఉన్న కేక్‌లు

- నూతన సంవత్సరానికి స్వాగతం పలికిన జనం
- 2024ను సాగనంపి, 2025కు వెల్‌కం
- జిల్లా వ్యాప్తంగా హోరెత్తిన సంబరాలు
- కేరింతలు, డ్యాన్సులతో మోర్మోగిన పరిసరాలు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కాలచక్రం గిర్రున తిరిగింది. చూస్తూ చూస్తుండగానే మరో వసంతం వచ్చేసింది. కొత్త ఆశలు, ఆశయాలతో కొత్త సంవత్సరంలోకి ప్రపంచం అడుగుపెట్టబోతోంది. 2024ను సాదారంగా సాగనంపి, 2025కు స్వాగతం పలుకుతోంది. ఈ వేడుక మంగళవారం అర్ధరాత్రి నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాల్లో మునిగి తేలారు.

నూతన సంవత్సర వేడుకలను జిల్లా ప్రజలు అంత్యంత ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం రాత్రి (డిసెంబరు 31) బాగా ఎంజాయ్ చేశారు. ఆటపాటలు, స్టెప్పులతో పరిసరాలన్నీ మార్మోగాయి. కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మందు తాగి చిందులు వేశారు. స్వీట్లు, బిర్యానీలు ఆరగించి పార్టీలు చేసుకున్నారు. రాత్రి 12 కాగానే ఒక్కసారిగా అందరూ మూకుమ్మడిగా కేరింతలు కొడుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.

రంగులకు భలే గిరాకీ..

నూతన సంవత్సరాన్ని స్వాగతం పలుకుతూ మహిళలు తమ వాకిళ్లల్లో రాత్రి నుంచే ముగ్గులు వేయడం మొదలెట్టారు. తీరొక్క రంగువళ్లలతో తమ లోగిళ్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. పూలతో తోరణాలు కట్టి అందంగా తీర్చిదిద్దారు. దీనికి ముందు యువతులు, మహిళలు మార్కెట్‌లో ముగ్గులు, రంగులు కొనుగోలులో బిజీగా కనిపించారు. అయితే.. ఈసారి పావుకిలో రంగు రూ.20 చొప్పున విక్రయాలు జరిగాయి. ఒక్కోచోటా రూ. 10 ప్యాకెట్లు సైతం లభ్యమయ్యాయి. అలాగే పూల ధర మూరకు రూ.50 నుంచి 70వరకు పలికింది.

భారీగా కేక్‌ల కొనుగోలు

నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జనం భారీగా కేక్‌లను కొనుగోలు చేశారు. దీంతో మంగళవారం జిల్లాలోని బేకరీలన్నీ కళకళలాడాయి. ఒక్కో కేక్ ధర రూ.300 నుంచి రూ.1000 వరకు పలికింది. రకరకాల డిజైన్లతో బేకరీ యజమానులు కేక్‌లను తయారు చేసి విక్రయించారు.

విస్తృతంగా పోలీసు గస్తీ.. తనిఖీలు



జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో 31వేడుకల బందోబస్తులో సీఐ నరేష్‌కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు జిల్లా కేంద్రంలో పటిష్ఠ బందోబస్తు చేపట్టారు. మంగళవారం రాత్రి 8 గంటల నుంచే గస్తీ చేపట్టారు. ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీ చేశారు. ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో పట్టణ సీఐ నరేష్‌కుమార్ నేతృత్వంలో పకడ్బందీ చర్యలు చేపట్టారు. విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా అంబేద్కర్ కూడలి, గణేష్‌చౌక్, జయశంకర్ విగ్రహం, 5 ఇన్‌క్లైన్ కమాన్, 2 ఇన్‌క్లైన్ సమీపంతో పాటు ఇతరత్రా ప్రాంతాల్లో గస్తీ చేపట్టారు. పెట్రోకార్ వాహనాలతో పోలీసులు వాహనాల్లో సైరన్లతో రోడ్లపై గస్తీ చేశారు. రాత్రి 12 తర్వాత తిరిగే వాహనదారులను ఆపి డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు చేశారు. త్రిపుల్ రైడ్ వాహనాలను ఆపి ఫొటోలు తీసుకొని జరిమానాలు విధించారు.

కిటకిటలాడిన మద్యం దుకాణాలు

నూతన సంవత్సరం ప్రారంభ వేడుకల నేపథ్యంలో మద్యం దుకాణాలన్నీ కిటకిటలాడాయి. షాపుల ముందు మందుబాబులు బారులు తీశారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఏడు మద్యం షాపులు మంగళవారం రాత్రి వరకు కిక్కిరిసిపోయాయి. మద్యం దుకాణాలు రాత్రి 10 గంటలకే బంద్ కానున్న దృష్ట్యా ముందుగానే భారీగా కొనుగోలు చేశారు.







గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసితులకు మెరుగైన పరిహారం

- బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్టు ఆర్డీవో వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మంగిలాల్

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం భూములు ఇచ్చిన 98 మంది రైతులకు ప్రభుత్వం పరిహారం అందించిందని ఆర్డీవో మంగిలాల్ తెలిపారు. నిర్వాసిత రైతుల బ్యాంకు ఖాతాల్లో మంగళవారం డబ్బులు జమ అయ్యాయని అన్నారు. భూపాలపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. గతంలో భూసేకరణ జరిగి అవార్డు చేపట్టి రూ.3.40 లక్షల నుంచి రూ.6.50 లక్షల వరకు పరిహారం పొందిన రైతులు తమకు ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లించాలని కోరారన్నారు. దీంతో కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఒక్కో రైతుకు ఎకరానికి రూ.22 లక్షల నుంచి రూ.28 లక్షల వరకు ఆర్బిటేషన్‌లో భాగంగా చెల్లించినట్టు తెలిపారు. భూపాలపల్లి జిల్లా పరిధిలోని చిట్యాల, టేకమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని 14 గ్రామాలకు చెందిన 445 మంది రైతులకు సంబంధించిన 375 ఎకరాల వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణానికి తీసుకోవాల్సి ఉందన్నారు. సుమారు 35 కిలో మీటర్ల మేర ఈ ప్రాంత రైతుల భూములు సేకరించినట్లు పేర్కొన్నారు. 200 మంది రెతులకు మెరుగైన పరిహారం అందిందని, ఇంకా మిగిలిన వారికి కూడా ఈ అవకాశాన్ని సదినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో సూచించారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం మెరుగైన పరిహారం అందించేలా చర్యలు చేపడుతామని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు.





